
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 అక్టోబర్ 2023
5
తిరుపతి



ఆర్డీవో రవిశంకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఆర్డీవోగా ఎన్.రవిశంకర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ఆర్డీవోగా పని చేస్తున్న కేఎస్ రామారావును విజయవాడ కనకదుర్గ ఆలయ కార్య నిర్వహణాధికారిగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కడప భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టరు వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న ఎన్. రవిశంకర్ రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమిస్తూ ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తరువాత వరుస సెలవులు రావడంతో రవిశంకర్ రెడ్డి బాధ్యతలు తీసుకోవడానికి ఆలస్యం జరిగింది. ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్న రవిశంకర్ రెడ్డిని డివిజను పరిధిలోని తహసీల్దార్లు, రెవిన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.



నిజం గెలవాలి సభలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి



తిరుపతిలో స్వాగతం పలుకుతున్న జనసేన నేతలు



తండ్రి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తూ...

'ఆయన'కు ప్రజలే 'ప్రాణం'

- 'నిజం గెలవాలి' సభలో నారా భువనేశ్వరి
- నారావారిపల్లి నుంచి బస్సుయాత్ర ప్రారంభం
- మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఆయనకు ప్రజలంటే ప్రాణం.. పార్టీ కార్యకర్తలన్నా, నాయకులన్నా సొంత బిడ్డల్లా చూసుకుంటారు.. ప్రజలు, పార్టీ తరువాతనే కుటుంబం..' అని నారా భువనేశ్వరి అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలనతో నిజం ఈ రోజు గెలవకపోవచ్చు.. ఎప్పటికైనా నిజం అనేది గెలిచి తీరుతుంది.. చేయి చేయి కలిపి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన తరుణం ఆసన్నమయ్యింది.. ప్రతి ఒక్క టిడిపి కార్యకర్తా కంకణబద్ధులై నిజాన్ని గెలిపించే పనిలో ఉండాలి..' అని నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి భావోద్వేగ ప్రసంగం చేశారు. 'నిజం గెలవాలి' బస్సు యాత్ర చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రారంభమయ్యింది. అంతకుముందు ఉదయం 11 గంటలకు చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక భావోద్వేగానికి గురై గుండెపోటుతో మృతిచెందిన పాకాల మండలం నేండ్రగుంటకు చెందిన కనుమూరి చిన్నబ్బనాయుడు, చంద్రగిరిలో ప్రవీణ్‌రెడ్డి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి స్వయంగా వెళ్లి ఓదార్చారు. ఎన్టీఆర్ ట్రస్టు తరపున ఒక్కొక్కరికి మూడు లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. అగరాల వద్ద జరిగిన 'నిజం గెలవాలి' బహిరంగసభకు మహిళలు పెద్దఎత్తున కదం తొక్కారు. 'రెండు రోజుల క్రితం నారావారిపల్లికి వచ్చాను.. ఎపుడూ కుటుంబమంతా వచ్చి ఎంతో సంతోషంగా గడిపేవాళ్లం.. ఈసారి ఒక్కదాన్నే వచ్చాను.. గతంలో ఆనంద క్షణాలు గుర్తుకొచ్చి చాలా బాధగా ఉంది' అని భావోద్వేగంతో కంట తడిపెట్టడంతో సభలో మహిళలు సైతం కన్నీరుమున్నీరవడం కనిపించింది. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ప్రజల కోసమే ఆలోచించారు తప్ప, కుటుంబానికి పెద్దగా ప్రాధాన్యత ఇచ్చేవారు కాదన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా తన భర్తను రాజమండ్రి సెంట్రల్ జైల్లో నిర్బంధించారని, త్వరలోనే కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటకు వస్తారని, అప్పటివరకూ టిడిపి శ్రేణులంతా తనకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఒక ముఖ్యమంత్రి కూతురిగా, ఓ ముఖ్యమంత్రి భార్యగా ఎపుడూ బయటకు రాని భువనేశ్వరమ్మ ఈరోజు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు మీ ముందుకు వచ్చారన్నారు. ప్రతి తెలుగు మహిళా, ప్రతి టిడిపి అభిమాని ఆమెకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. మాజీ స్పీకర్ ప్రతిభాభారతి మాట్లాడుతూ '2024లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు అను నేను' ప్రమాణం చేస్తున్నా అని చెప్పేంత వరకూ టిడిపి శ్రేణులన్నీ ఒక్కటవ్వాలన్నారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్న ఐదేళ్లు చిత్తూరు జిల్లాలో వైసిపి కార్యకర్తలపై ఓ కన్నేసి ఉంటే ఈరోజు జగన్ ప్రభుత్వం ఉండేదా? అని ప్రశ్నించారు. అదే చంద్రబాబుకు, జగన్‌కు తేడా అన్నారు. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి చూడాలంటారని, జగన్ రాష్ట్రం నాశనం కావాలని కోరుకుంటున్నారన్నారు. త్వరలోనే ప్రజలందరూ ప్రజాక్షేత్రంలో న్యాయాన్ని గెలిపించాలన్నారు. ఈ టిడిపి అధికార ప్రతినిధి నల్లారి నరేష్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సిలు దొరబాబు, కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తినాని, పులివర్తి సుధారెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. 'నిజం గెలవాలి' అనే బ్యాక్‌డ్రాప్ బ్యానర్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫొటో కనిపించింది. అయితే జనసేన శ్రేణులు ఎవరూ సభకు హాజరుకాకపోవడం గమనార్హం. అనంతరం 'నిజం గెలవాలి' బస్సు యాత్ర తిరుపతి నియోజకవర్గంలో అడుగు పెట్టింది. తిరుపతిలో గురువారం జ రగనున్న నిజం గెలవాలి సభను జయప్రదం చేయాలని మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు.

బిజెపి ద్వంద్వవైఖరిని ఎండగడదాం..!

టిటిడి నిధులు కేటాయించేవరకూ పోరాటం/పరిపాలనా భవనం వద్ద అఖిలపక్షం ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అభివద్ధి విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని, సమస్య పరిష్కారం అయ్యేవరకూ వివిధ రూపాల్లో పోరాడుతూనే, బిజెపి ద్వంద్వవైఖరిని ఎండగట్టాలని అఖిలపక్ష నేతలు ఉద్ఘాటించారు. అవసరమైతే తిరుపతి ఎంఎల్‌ఏ, టిటిడి ఛైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి అఖిలపక్షపార్టీలను సిఎం వద్దకు తీసుకెళ్లయినా సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి అభివద్ధి వేదిక ఆధ్వర్యంలో టీటీడీ పరిపాలన భవనం వద్ద జరిగిన ధర్నాలో అఖిలపక్షం నేతలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. తిరుపతి అభివృద్ధికి ఒక్కశాతం నిధులను టిటిడి పాలకమండలి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం సమంజసం కాదని విమర్శించారు. తిరుపతి అభివద్ధి వేదిక కన్వీనర్ టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళి (సిపిఎం), పి. మురళి (సిపిఐ), ఆర్. హరికష్ణ (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ) పి.అంజయ్య (ఆర్‌పిఐ) నీరుగట్టు నగేష్, వెంకటాచలపతి (ఆమ్ ఆద్మీ) డిఎంసి భాస్కర్ (కాంగ్రెస్) ఆర్మాట్ కష్ణ ప్రసాద్ (బిఆర్ఎస్) తదితరులు ప్రసంగించారు. బిజెపి, విహెచ్‌పిల ధర్నా పోస్టర్లకు భయపడి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం టిటిడి బోర్డు ప్రతిపాదనను తిరస్కరించడాన్ని వారు తప్పుబట్టారు. హిందూ వ్యతిరేకిగా ముద్ర వేస్తారని భయపడి జగన్మోహన్‌రెడ్డి ఈ రకంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. తిరుపతి ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని తక్షణం తిరస్కరణపై పున్ణపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. టిటిడి లాంటి ధార్మిక సంస్థ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలని సూచించారు. 4,500 కోట్ల రూపాయల ఆదాయం ఉన్న టిటిడికి ఒక్కశాతం నిధుల కేటాయింపు పెద్ద విషయం కాదన్నారు. దీనిని చట్టంగా మార్చడం ద్వారా భవిష్యత్ అవసరాలు ఎవరి దయాదాక్షిణ్యాలతో కాకుండా తిరుపతి అవసరాలు తీర్చుకోడానికి తోడ్పడుతుందన్నారు. తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు సాధించేంత వరకూ వివిధ రూపాల్లో ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని నేతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, జి. బాలసుబ్రమణ్యం, కేఎన్ఎన్ ప్రసాదరావు, రామకష్ణ, ముని రాజ, సురేష్ , ముకేష్ ,చిరంజీవి ,గజేంద్ర, సిపిఐ నేతలు రాధాకష్ణ, చిన్నం పెంచలయ్య శ్రీరాములు,ఎన్ డి రవి, కవి రచయిత గొడుగు చింత గోవిందస్వామి, బిఆర్ఎస్ నేత బెల్లంకొండ సురేష్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు వెంకయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

'మిట్టగాంధీపురం'లో భూ వివాదం

లబ్ధిదారుల చాటున అధికార పార్టీ నాయకుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంగా దినదినాభివద్ధి చెందుతున్న నేపథ్యంలో తిరుపతితో పాటు తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ విలువలు పెరిగాయి. దీంతో పాటుగా భూ సమస్యలు, వివాదాలు, కబ్జాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇదే అదునుగా అధికార పార్టీ నాయకులు పైరవీలు చేయించుకుంటూ అందిన కాడికి వెనకేసే విధంగా రహస్య కార్యాచరణతో ముందుకెళుతున్నారు. నాటి నుండి నేటి వరకు భూ విలువ క్రమేపి పెరుగుతున్న తరుణంలో లొసుగులు కలిగిన భూములను, సర్వే నంబర్లను తెలుసుకోంటూ ఇదే అదునుగా చేసుకుని రాత్రికి రాత్రి తమ పని చేస్తున్నారు. ఇలాంటి ఉదంతమే చంద్రగిరి నియోజకవర్గం మంగళం పరిధిలోని మిట్టగాంధీపురం వద్ద జరిగింది. మిట్ట గాంధీపురం హరిజనవాడ ప్రజలకు లబ్ధి చేకూరేలా 1982వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం గ్రామ రెవెన్యూ లెక్క దాఖల సర్వేనెంబర్ 78లోని 16 ఎకరాల విస్తీర్ణంలో 32 మంది లబ్ధిదారులకు 45 సెంట్లు లెక్కన రైత్వారి పట్టాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే నిజమైన లబ్ధిదారుల చాటున అప్పటి రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారంతో కొందరు రాజకీయ నాయకులు చేరి భూ రికార్డులను తారుమారు చేసి తమకు లబ్ధి చేకూరేలా పనులు కానిచ్చేశారని విశ్వసనీయ సమాచారం. ఇటీవల ఈ సర్వే నంబర్లో మిట్ట గాంధీపురంలో నివసిస్తున్న వారికి ఇంటికో ఫ్లాట్ ఇచ్చే విధంగా నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదేశించినట్లు సమాచారం. దీంతో లబ్ధిదారుల చాటున ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీకి చెందిన ప్రస్తుత అధికార పార్టీ నాయకుడొకరు ఏకంగా మూడు ఫ్లాట్లను దక్కించుకోవడంతో లబ్ధిదారులు భగ్గుమన్నారు. లబ్ధిదారులకు రావలసిన దానిలో అధికార పార్టీ నాయకుడు ప్రవేశించడంతో వివాదం నెలకొంది. ఈ సమస్య బయటకు పొక్కడంతో ఆ నాయకుడు దిక్కుతోచని పరిస్థితుల్లో లబ్ధిదారులను ప్రాధేయపడుతున్నట్టుగా సమాచారం. అయితే లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మిట్టగాంధీపురం లబ్ధిదారుల ప్రయత్నం ఏ మేరకు పరిష్కారం అవుతుందో వేచి చూడాలి.



ఖాళీ స్థలంలో నిర్మించిన ఇంటి నిర్మాణం

స్విమ్స్‌లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

తిరుపతి సిటి : స్విమ్స్ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన వైద్యుల భర్తీ ప్రక్రియలో రూలాఫ్ రిజర్వేషన్ పాటించినందుకు డైరెక్టర్ ఆర్‌వి కుమార్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగసంఘాల నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మూర్తి, కోబాకు భూపాల్, పరమశివం, ప్రసాదరావు, భాస్కర్ పాల్గొన్నారు.



స్కూల్ ఆన్‌లైన్ రెన్యువల్ తిప్పలు

సాంకేతిక సమస్యతో మొరాయిస్తున్న సాఫ్ట్‌వేర్
31 చివరి తేదీ కావడంతో 'ప్రైవేట్'లో టెన్షన్

ప్రజాశక్తి - బాలాయపల్లి

రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ గుర్తింపుతో నడిచే ప్రైవేట్ పాఠశాలల రెన్యువల్ రిక్గ్ని జేషన్‌కి దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ సమస్యతో యాజమాన్యాలు తీవ్ర అవస్థలు పడుతు న్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలల రెన్యువల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 31తో గడువు ముగియనుంది. ఇప్పటికే పలు యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా సాంకేతిక సమస్య వల్ల స్కూల్ లాగిన్‌లో కర్సర్ పాయింట్ ముందుకు కదలని పరిస్థితి ఉంది.

మొరాయిస్తున్న సాఫ్ట్‌వేర్


ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ మొరాయిస్తుండటం వల్లే ఇటువంటి ఇబ్బందులు ఎదుర వుతున్నాయని కరస్పాండెంట్లు వాపోతున్నారు. వ్యయప్రయాసలకోర్చి ఎన్‌వోసీలు తెచ్చుకున్నా.. సకాలంలో స్కూళ్ల రెన్యువల్ గుర్తింపు పొందలేని పరిస్థితి ఉందంటున్నారు. పాఠశాలవిద్య ఐటీ సెల్ అధికారులు, డీఈవోలను నేరుగా సంప్రదించి సమస్యను వివరించినా పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు. సకాలంలో పాఠశాలకు గుర్తింపు తీసుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ఓసీతో లింకు

విద్యాశాఖలో ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన సాఫ్ట్‌వేర్‌ని ఫైర్, శానిటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, పోలీసు, ఇంజనీరింగ్, ఆర్టీఏ వంటి విభాగాలకు లింకు ఇచ్చారు. స్కూల్ లాగిన్‌లో సబ్మిట్ చేసిన డాక్యుమెంట్లను ఆయా విభాగాలు ఎన్‌వోసీ క్లియరెన్స్ ఇచ్చాకే రెన్యువల్ రిక్గ్నిజే షన్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. స్కూళ్ల మేనేజ్‌మెంట్లు అవస్థలు పడి ఎన్‌వోసీలు తెచ్చుకుని అప్‌లోడ్ ప్రక్రియను పూర్తి చేశారు.

ముందుకు కదలని పరిస్థితి

ఏ ఒక్క డిపార్ట్‌మెంట్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా స్కూల్ లాగిన్‌లో ముందుకు కదలని పరిస్థితి. సంబంధిత విభాగాల అధికారులను ఎర్రర్ కరెక్షన్ చేయమని మేనేజ్‌మెంట్లు అడిగితే... స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషన రేట్‌లో చేస్తే తప్ప తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. కొందరు కరస్పాం డెంట్లు నేరుగా స్టేట్ ఐటీసెల్ డిపార్ట్‌మెంట్‌లో విషయం వివరించారు. అయినా వారినుంచి స్పందన లేదని అవేదన చెందుతున్నారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారేగానీ సమస్యకు పరిష్కారమార్గం చూపడంలేదు. ప్రధానంగా ఆర్టీఏ డిపార్ట్‌మెంట్‌లో టెక్నికల్ సమస్య ఉందని, స్కూళ్ల బస్సుల సమాచారం తప్ప.. విద్యాపరమైన ఇతర సమాచారంతో పనిలేని ఈ డిపార్ట్‌మెంట్‌కి లింకు అవసరం ఏముందని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికార వర్గాలు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



'కల్కి'ని స్వాధీనం చేసుకోవాలి

తిరుపతి(మంగళం): కల్కి భగవాన్‌గా పిలువబడే విజయకుమార్ వరదయ్యపాలెం దగ్గర షుమారు 20 సంవత్సరాల క్రితం మూడెకరాల డెబ్బయి నాలుగుసెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించి దాదాపు 500 కోట్ల రూపాయలతో ఆశ్రమాన్ని నిర్మించాడని, వెంటనే రాష్ట్రప్రభుత్వం ఈ ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకోవాలని ఏపిహేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుదవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్రమణ జరిగినట్లు అప్పటి కలెక్టర్ కూడా నిర్ధారించారని గుర్తు చేశారు.

అనుమతి మాకెందుకు...?

యథేచ్ఛగా ఎర్రబంగారం తరలింపు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్

అధికార పార్టీ 'ముద్ర' వేసుకుంటే చాలు... అనుమతి లేకుండా ఎక్కడినుంచి ఎక్కడికైనా ఎర్రబంగారాన్ని యథేచ్ఛగా తరలించేయొచ్చు... అక్రమార్కులు రాత్రికి రాత్రే జేసీబీలతో తవ్వేయడం, టిప్పర్లతో సరిహద్దులు దాటించేయడం గప్‌చిప్‌గా జరిగిపోతుంది.. అధికారులు రాత్రుల్లో నిద్ర పోతున్న కారణంగా తెల్లారి స్థానికులు ఎవరైనా 'ఎర్రబంగారం తరలించారు' అని చెబితే.. 'ఔనా.. మాకు తెలియదు.. చర్యలు తీసుకుంటాం' అని చెప్పడం షరా'మామూలు' అయ్యింది.. వేడం పంచాయతీ ఓటు చెరువులో ఎటువంటి అనుమతి లేకపోయినా ఎర్రబంగారం యథేచ్ఛగా తరలిపోవడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనువుగా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. తక్కువ ధరకే ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చామని చెబుతోంది. అయితే కొంతమంది అధికార పార్టీ నాయకులు ఎటువంటి అనుమతి లేకనే ఇసుక, గ్రావెల్, ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలించేస్తున్నారు. బుధవారం వేడం పంచాయతీ ఓటుచెరువులో జేసీబీ సాయంతో టిప్పర్లతో ఎర్రమట్టి తరలిస్తూ 'ప్రజాశక్తి'కి కనిపించింది. చెరువును పరిశీలించగా పెద్దపెద్ద గుంతలతో భూగర్భజలాలు అడుగంటిపోయి ఉన్నాయి. వర్షం వచ్చి చెరువు నిండితే పెద్ద పెద్ద గుంతలే ప్రాణాలు తీస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ ఇరిగేషన్ ఎఇ రాఘవేంద్రరావును వివరణ కోరగా వేడం పంచాయతీ ఓటు చెరువులో గ్రావెల్ తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఓటు చెరువులో ఎవరికీ గ్రావెల్ తరలించడానికి అనుమతి లేదని, అక్రమంగా ఎవరైనా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు





చీడపీడలతో...కూర'గాయాలు'



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

వర్షాధారమైన కరువు జిల్లాలో పాడి పరిశ్రమ రైతును ఎంతగా ఆదుకుంటుందో, అంతేస్థాయిలో కూరగాయలు, పండ్ల సాగు సైతం అన్నదాతకు ఆదరువుగా ఉంటోంది.. వంగ, బెండ వంటి కూరగాయల సాగులో చాలామంది సన్న చిన్న కారు రైతులు జీవనోపాధి పొందుతున్నారు. అయితే ఈ పంటల్లో చీడల సమస్య రైతులను భయపెడుతోంది. ఓ పద్ధతి ప్రకారం చర్యలు చేపడితే చీడలను అదుపులో ఉంచవచ్చు. ప్రస్తుతం సాగులో ఉన్న వంగ, బెండ తోటల్లో అక్షింతల పురుగు(పెంకు పురుగులు), కొమ్మ , కాయ తొలుచుపురుగు ఎక్కువ ఆశించి పంటను నష్టపరుస్తున్నాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఎడిఎ మెరుగు భాస్కరయ్య 'ప్రజాశక్తి'కి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి చీడల నివారణ చేపడితే నాణ్యమైన కూరగాయలు పండుతాయని సూచించారు. ప్రస్తుతం కూరగాయల ధరలు రెండు నెలలుగా కిందకు దిగిరానంటున్నాయి. ఈ నేపథ్యంలో నాణ్యమైన కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తే 'ఎ'గ్రేడ్ ధరను దక్కించుకోవచ్చని పేర్కొన్నారు.

అక్షింతల పురుగు పిల్ల పురుగులు శరీరంపై వెంట్రుకలు కలిగి, ఆకుల ఈనెల మధ్య పచ్చదనాన్ని తినేసి, ఆకులను జల్లెడగా మారుస్తాయి. వీటి తల్లి పెంకు పురుగులు,



ఆకులను, పూ మొగ్గలను తింటూ వాటిపై రంధ్రాలు చేస్తాయి. ఎదిగే మొక్కలలో కొమ్మ తొలిచే పురుగు ఆశించి కొమ్మ చివర్లు వాడి ఎండిపోయేటట్లు చేస్తాయి. కాయలు ఏర్పడే దశ నుండి ఈ పురుగులు కాయలలో రంధ్రాలు చేసి, పుచ్చు కాయలుగా చేసి అమ్మకానికి పనికి రాకుండా చేస్తాయి.

వంగ, బెండ పంటలను నాటిన తొలి దశలలో మొక్కలపై ఏవైనా అక్షింతల పురుగుల పెంకు పురుగులు గమనిస్తే వాటిని ఏరి నాశనం చేయాలి. కొమ్మతొలుచు పురుగు ఆశించిన రెమ్మలను ఎప్పటికప్పుడు కింది వరకు తుంచి నాశనం చేయాలి. పంట కాపుకు ముందు దశలో ఈ పురుగుల నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ క్లోరిపైరిపాస్, 2.5 మి. లీ క్వినాల్ ఫాస్, 2 మి.లీ ప్రొఫెనోఫాస్ లేదా 2 గ్రాముల లార్విన్ మందులలో ఒక దానిని 5 మి. లీ వేప మందుతో కలిపి స్ప్రే చేయాలి. అవసరాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో మందు మార్చి మరోసారి స్ప్రే చేయవచ్చును.

కాపు దశలో, ఈ పురుగుల నివారణకు, కాయలు కోసే ముందు, ఈ పురుగులు ఆశించిన రెమ్మలను, కాయలను, పిందెలను పూర్తిగా తొలగించి నాశనం చేయాలి. తర్వాత కాయలు కోసేయాలి. కాయలు కోసిన తర్వాత, తోటలోని చెట్లు బాగా తడియునట్లు లీటరు నీటికి 0.5 గ్రా ఎమామెక్టిన్ బెంజోయేట్, 0.4 మి. లీ కోరాజిన్, 2 మి.లీ ప్రొఫినోపాస్ లేదా 0.4 మి. లీ స్పైనోసాడ్ మందులలో ఒక దానిని 5 మి. లీ వేప మందుతో కలిపి స్ప్రే చేయాలి. అవసరాన్ని బట్టి, ఒకసారి కొట్టిన మందు తిరిగి కొట్టకుండా, మందు మార్చి 7-10 రోజుల వ్యవధిలో స్ప్రే చేయాలి. వంగ, బెండ కాయలు కోసేముందు రైతులు ఎట్టి పరిస్థితులలోనూ మందులు స్ప్రే చేయకూడదు.

ఈ కూరగాయల తోటలలో పచ్చ దోమ, తెల్ల దోమ, పెను వంటి రసం పీల్చే పురుగులు గమనిస్తే పై మందులతో పాటు లీటర్ నీటికి 0.5 మి. లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 మి. లీ రోగార్ మందును కలుపుకొని స్ప్రే చేయాలి.

శెట్టిపల్లి...విసుగు చెంది..!

అక్టోబర్ ముగుస్తున్నా భూసమస్య యథాతథం

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

శెట్టిపల్లి భూసమస్య దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉంది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కావాలని రైతులుతోపాటు కొనుగోలు చేసిన ఇళ్లస్థలాల లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పగా, అక్టోబర్ 25వ తేదీ 'ప్రొసీజర్స్' ఇస్తామని స్వయానా కలెక్టర్ వెల్లడించారు. అయితే ఇపుడు తిరుపతి ఆర్డీవో కనక నరసారెడ్డి బదిలీ అయ్యారనే 'సాకు' దొరికింది. కనీసం నవంబర్‌లో అయినా పత్రాలు ఇస్తారా? అని శెట్టిపల్లి రైతులు, లబ్ధిదారులు ఆశగా నిరీక్షిస్తున్నారు.

శెట్టిపల్లి భూనిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేయడం, అధికార పార్టీ నాయకులను, అధికారులను కలిసిన ఫలితంగా ఎట్టకేలకు ఇటీవల శెట్టిపల్లి భూములను సర్వే చేశారు. 'ఇపుడే పత్రాలు ఇచ్చేస్తాం' అని చర్చల సందర్భంగా అధికారులు, వైసిపి నేతలు చెబుతున్నా జాప్యం జరుగుతూనే ఉంది. వచ్చే ఎన్నికల్లోపు ఈ సమస్య పరిష్కరించే ప్రచారం చేయాల్సి ఉంటుంది. బాధితులకు వెంటనే న్యాయం చేయాలని వామపక్షాలు, వైసిపి నేతలు ఇటీవల కలెక్టర్ వెంకటరమణారెడ్డితో భేటీ అయ్యారు. అక్టోబర్ 25కల్లా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు మొదటగా హక్కు పత్రాలు ఇస్తామని, ఇళ్లస్థలాలు కొనుగోలుదారులకు తరువాత ఇస్తామన్నారు. వామపక్ష నేతలు మాత్రం అందరికీ ఒకేసారి హక్కుపత్రాలు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అందరికీ పత్రాలు ఇచ్చేందుకు కలెక్టర్ ఓకే అన్నారు. ఇంతలోనే ఆర్డీవో కనక నరసారెడ్డి తాజాగా బదిలీ అయ్యారు.



251మంది రైతులకు పత్రాలు

శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కరం చూపేందుకు అధికార్లు భూసేకరణ చేశారు. టిడిపి ప్రభుత్వం హయంలో ఒకసారి భూసేకరణ చేశారు. తరువాత వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మరో సారి భూసేకరణ చే శారు. తుడా ఆధ్వర్యంలో భూములు సర్వేచేసి నోటిఫికేషన్‌తో మొదలైంది. 251మంది రైతులు, 2208మంది ఇళ్లస్థలాల కోనుగోలు దారులుకు భూములపై హక్కులు కల్పించేందుకు పనులు మొదలు పెట్టారు. 2019లో మరోసారి భూసేకరణ చేశారు. రైతులు, ఇళ్లస్థలాల కోనుగోలు దారులు వద్ద ఉన్న 348.77 ఎకరాలును రీసర్వే చేసి ఇందులో 163.74 ఎకరాలు 251మంది రైతులు అర్హులుగా , 123.09 ఎకరాలు భూమికి 2206 మంది ఇళ్ల స్థలాలు యజమానులుగా గుర్తించారు. మరో 61.94 ఎకరాలు ఎలాంటి రికార్డులు లేకుండా కేవలం రైతుల అనుభవంలో ఉన్నట్లు గుర్తించారు. భూపత్రాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

వెంటనే పత్రాలు ఇవ్వాలి:సిపిఎం

శెట్టిపల్లి భూబాధితులకు వెంటనే అర్హత పత్రాలు ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. అధికార్లు వాయిదాలు వేయడం, ఆలస్యం చేయడం తగదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బాధితులకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ స్పందించి తర్వగా న్యాయం చేయాలన్నారు.

ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్ లాగిన్ నత్తనడక

వాలంటీర్ల పనితీరుపై ఎంపిడివో ఆగ్రహం

ప్రజాశక్తి -సత్యవేడు: ప్రతి కుటుంబాన్ని సందర్శించి ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్ లాగిన్, డౌన్‌లోడింగ్ పూర్తి చేయించడంలో గ్రామ వాలంటీర్లు చూపుతున్న నిర్లక్ష్యం పై తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండ ల పరిధిలోని ఇరుగుళం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యశ్రీ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్ లాగిన్ నతనడకపై పలువురు గ్రామ వాలంటీర్లకు క్లాస్ తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరుగుతున్న ఆరోగ్యశ్రీ వల్ల ఎంతో మంది నిరుపేద రోగులకు ఉచిత వైద్య సేవ అందుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆరోగ్యశ్రీలో దాదాపు 5 లక్షల రూపాయలకు సంబంధించి వైద్యం చేయించుకునే వెసులు బాటు ఉందన్నారు. అయితే ప్రతిగ్రామ వాలంటీరు వారికి కేటాయిం చిన 50 కుటుంబాలను సందర్శించి ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషను డౌన్‌లోడ్ చేయించి లాగిన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆయన గ్రామ వాలంటీర్లను ఆదేశించారు. అయితే గ్రామ వాలంటీర్లు ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్ లాగిన్ పూర్తి చేయించ డంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్ప వన్నారు. ఇప్పటి వరకు ఇరుగుళం గ్రామ సచివా లయ పరిధికి సంబంధించి 961 అప్లికేషన్లకు 287 అప్లికేన్లు మాత్రమే ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్ లాగిన్ పూర్తి చేసినట్టు పేర్కొ న్నారు.



జగనన్న ఆరోగ్యశ్రీ వైద్యశిబిరంలో పాల్గొన్న ఎంపిడివోచంద్రశేఖర్

ఇలా అయితే కుదర దని గ్రామ వాలంటీర్లకు తేల్చి చెప్పారు. మొబైల్ అప్లికేషన్ లాగిన్‌లో ప్రగతి చూపించాలని ఆయన కోరారు. ఈ వ్యవహారంపై వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా, గ్రామ సర్పంచ్ శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సురక్ష సభలోనే ఎంపిడిఓ చంద్రశేఖర్ గ్రామ వాలంటీర్లకు క్లాసు తీసుకోవడంతోపాటు దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షించి ముందుకెళ్లాలని సంబంధిత పంచాయతీ సెక్రటరీ ప్రకాష్‌ను ఆదేశించారు. ఏది ఏమైనా ఆరోగ్యశ్రీ మొబైల్ అప్లికేషన్ లాగిన్, డౌన్‌లోడింగ్ ప్రక్రియ నత్తనడకన కొనసాగడం పట్ల ఎంపీడీవో చంద్రశేఖర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.



'రోడ్డు భద్రత అవగాహన' పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, గుడ్ సమారిటిన్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్, కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన రోడ్డు భద్రతా అవగాహన పోస్టర్‌లు, కరపత్రాలు, బుక్ లెట్స్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు గత ఏడాదితో పోలిస్తే ప్రమాదాలు తగ్గినా మరణాల శాతం తగ్గడం లేదన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డన్ అవర్ మొదటి గంటలోపు వైద్య సహాయం అందించే చర్యలు గుడ్ సమారిటన్ ద్వారా చేపట్టడానికి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, అప్పుడే ప్రమాద బాధితులను కాపాడవచ్చని సహాయం అందించిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం రూ.5 వేలు పారితోషికం ఇస్తోందన్నారు. ఈ సమీక్షలో జిల్లా రోడ్డుభద్రతా కమిటీ కన్వీనర్, జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి, రాష్ట్ర రోడ్డు భద్రతా కమిటి మెంబర్ సునీల్ చక్రవర్తి, ట్రాఫిక్ డిఎస్‌పి నరసప్ప, ఆర్ అండ్ బి ఇఇ శ్రీనివాసులు, ఎన్‌హెచ్ డిఇ నాగరాజు, కార్పోరేషన్ ఎస్ఇ మోహన్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా పట్టివేత

- 4 కేజీల గంజాయి, రూ.4,500 నగదు స్వాధీనం - ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -గూడూరు: నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిం చినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని గూడూరు సెబ్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టరు శేషమ్మ హెచ్చరించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్ ఇందిరమ్మ కాలనీలో గూడూరు సెబ్ ఇన్‌చార్జి సీఐ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ విస్తృత తనిఖీల్లో అనుమానంగా ఉన్న ఇద్దరు పురుషులు, ఒక మహిళ లను గుర్తించి పరిశీలించగా వారి వద్ద నాలుగు కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ముగ్గురు వ్యక్తులను, ఒక పల్సర్ ద్విచక్ర వాహనం, రూ.4500 నగదును స్వాధీన చేసుకుని అరెస్టు చేశారు. స్థానిక సెబ్ కార్యాలయంలో నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీఐ మాట్లా డుతూ నిందితులను విచారించగా వారందరూ గంజాయి విక్రయించి జైలుకు వెళ్లి వచ్చిన వారని తెలిపారు. అదే క్రమంలో గూడూరులో విక్రయిం చేందుకు సిద్ధపడుతున్న గాంధీ నగర్ కు చెందిన కొల్లపూడి వెంకటేష్, ఓజిలి మండలం లింగారెడ్డి పల్లి కామకూరుకు చెంది న వంగపూరి వంశీ, గాంధీనగర్ కు చెందిన వంగపూరి రమణమ్మ, ఒంగోలు పట్టణానికి చెందిన కాపా శ్రీనివాస్ రెడ్డిని గుర్తించామన్నారు. వారిలో కొల్లపూడి వెంకటేష్, వంగపూరు వంశీ,వంగపూరు రమణమ్మలను అరెస్ట్ చేశామన్నారు. త్వరలో నాలుగో నిందితుడు కాపా శ్రీనివాసులు రెడ్డి ని అరెస్ట్ చేస్తామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది ఎస్కే గౌస్ బాషా, రామ్ ప్రసాద్, రమేష్, ఆనందబాబు పాల్గొన్నారు.



సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టయిన నిందితులు

నేషనల్ బాడ్మింటన్ పోటీలలో గౌస్ జట్టుకు గోల్డ్ మెడల్



జాతీయ బాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించిన జట్టు

ప్రజాశక్తి -గూడూరు:గోవాలో నిర్వహించిన 37వ జాతీయ స్థాయి షటిల్ బాడ్మింటన్ క్రీడా పోటీలలో మిక్సెడ్ డబుల్స్ విభాగంలో ఆంధ్ర జట్టు క్రీడాకారులు ఛాంపియన్స్ గా నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ నెల 26వ తేదీ నుండి నవంబర్ 9వ తేదీ వరకు గోవాలో షటిల్ బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఆ పోటీలలో ఆంధ్ర రాష్ట్రం తరపున మిక్సెడ్ డబుల్స్ విభాగంలో షేక్ గౌస్, పూజా దండు జట్టు ప్రాతినిధ్యం వహించారు. ఫైనల్స్ లో తెలంగాణ జట్టు క్రీడాకారులు నవనీత్ బొక్కా, కే. మనీషా జట్టుపై వరుస రెండు సెట్లలో గెలుపొంది టైటిల్ కైవసం చేసుకున్నారు. ఆంధ్ర షట్లర్లు నేషనల్ ఛాంపియన్స్ గా నిలవడంతో రాష్ట్రంలో షటిల్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరులో సంబరాలు

గూడూరు నివాసి షేక్ గౌస్ మిక్సెడ్ డబుల్స్ లో నేషనల్ ఛాంపియన్ గా నిలవడంతో ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మూడు నెలల క్రితం గౌస్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్స్ టైటిల్ సిద్ధార్థ్ తో కలిసి కైవసం చేసుకున్నాడని, విజయాల పరంపర కొనసాగిస్తున్న గౌస్ అంతర్జాతీయ స్థాయిలోనూ చక్కగా రాణించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాలైన పేదరిక నిర్మూలన ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ పద్మావతి మహిళ అధ్యయన కేంద్రం రీడర్ కే. హైమావతి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకురాలు డాక్టర్ పి.సునీత ఆధ్వర్యంలో బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రు ఎడ్యుకేషన్ సహకారంతో అవగాహనను పద్మావతి నగర్ లోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, సింగిల్ గర్ల్ చైల్డ్ కోసం ప్రత్యేకమైన పథకం, అమ్మఒడి, జగనన్న మహిళా చేయూత, స్టార్టప్, మహిళా సాధికారత పెంచేందుకు వివిధ రకాల పెట్టుబడులకు చేయూత అందించే పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. చంద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. తులసి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశా చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. బాలికల కోసం ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ తో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు ఎన్నో విలువైన పోషక ఆహార పదార్థాలను అందిస్తోందన్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి పోషకాహారం అందిస్తున్నారన్నారు. బిసిడిటిఈ, మహిళ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య సుధారాణి మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం ప్రజా పౌరసరఫరాల కేంద్రం ద్వారా అనేక ఆహార పదార్థాలను అతి తక్కువ ధరలకు అందిస్తూ వారి జీవన సామర్థ్యం పెంచుతున్నాయన్నారు. విద్యార్థినులు, మహిళా సంఘాల లీడర్లు ప్రజలలో బిపిఎల్ లో నివసించే మహిళలకు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. సునీత, అంగన్‌వాడీ కేంద్రం టీచర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీ పద్మావతిమహిళా అధ్యయన కేంద్రం రీడర్ హైమావతి

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని బొడ్డుచౌకలోని మహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం వైభవంగా ఇర్వ హించారు. ఆలయంలో చండీహోమం, కుంభాభిషేక కార్యక్రమాల్లో వైసిపి నేత పోణకా శివకుమార్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ పాల్గొన్నారు. వీరికి ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు. శివకుమార్ రెడ్డి, దేవసేనమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం నిర్వాహకులు పోణకా దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కోదండరామయ్య, సాయి, నిర్వాహకులు ముని, సురేష్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

దర్శన్ సిల్క్స్ ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ దర్శన్ టైలర్స్ అధినేత వై. జానకి రమణారెడ్డి, రాజారెడ్డి సహకారంతో తిరుపతి నగరంలో దర్శన్ సిల్క్స్ ను బుధవారం ప్రారంభించారు. స్థానిక యాదవ్ వీధిలో ఏర్పాటు చేసిన షో రూమును రమణారెడ్డి తల్లిదండ్రులు మోహన్ రెడ్డి, విజయమ్మ దంపతులు ప్రారంభిం చి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రమణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత 20 సంవత్సరాలు పైగా తిరుపతి నగరంలో దర్శన్ టైలర్స్ ద్వారా అనేకమంది వినియోగదారుల మన్ననలు పొందామన్నారు. రెడీమేడ్స్ రంగంలోకి ప్రవేశించి దర్శన్ డ్రెస్సెస్ ను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా మహిళలకు ప్రత్యేకంగా దర్శన్ సిల్క్స్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవ సందర్భంగా మొదటి మూడు రోజులు బిల్లు బిల్ కూపన్స్ అందిస్తామని, ఈ ఆఫర్ 25, 26, 27 తేదీల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు, ప్రసాద్ రెడ్డి, అన్నా రామచంద్ర పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వాల్సిందే..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పోస్టల్ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం దసరా పండుగ కు ముందు ఇచ్చే బోనస్ దసరా పండుగ తరువాత కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించక పోవటాన్ని నిరసిస్తూ ఎన్ఎఫ్‌పిఈ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గూడూరు హెడ్ పోస్టు ఆఫీస్ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవిందు నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది లాగే పోస్టల్ ఉద్యోగులకు వెంటనే బోనస్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ సెక్రటరీ సుధాకర్ రాజు, గోవింద్ నాయక్ , చంద్ర శేఖర్ పెన్షనర్స్ సెక్రటరీ సుధాకర్ పాల్గొన్నారు.

తపాల ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టలు ఉద్యోగులు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రజాశక్తి - ఓజిలి: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళా మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఓజిలి మండలం చిలమానుచేను గ్రామానికి చెందిన ముంతల పద్మజ (35) ద్విచక్ర వాహనంపై గూడూరు నుంచి ఇంటికి వెళుతుండగా చిలమానుచేను గ్రామ సమీపంలోని పాత జబిఎం ప్లాంట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని పద్మజ మృతి చెందింది. ఈమె గూడూరులోని మండల పరిషత్ ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తోంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ దారం ఆదిలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని కారణాలు ఆరా తీస్తున్నారు.

నేటి నుంచి ఆర్‌టిసి కార్గో సేవలపై ప్రత్యేక డ్రైవ్: డిఎం

ప్రజాశక్తి -సత్యవేడు: ఆర్‌టిసి కార్గో సేవలపై అక్టోబర్ 26(నేటి) నుంచి నవంబర్ 25వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలకు సంబంధించి కొరియర్, సరుకు రవాణా చేస్తున్నా మన్నారు. ఇందులో భాగంగానే నెలరోజుల పాటు కార్గో సేవలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రత్యేక డ్రైవ్‌లో భాగస్వామ్యం చేస్తున్నా మన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తృత పరచడానికి ఆర్టీసీ ఉద్యోగుల సహకారం తప్పనిసరి అన్నారు. అందుకని సత్యవేడు ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి కనీసం నాలుగు కార్గో సర్వీస్‌లు బుక్ చేయాలని కోరారు. తద్వారా ఆర్టీసీ యాజ మాన్యానికి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈసారి తిరుమ లలో అక్టోబర్ 19,20 తేదీల్లో జరిగిన గరుడ సేవను పురస్కరించుకొని తిరుపతి నుంచి కంచికి, చెన్నైకు 7 ఆర్టీసీ బస్సులను నడపగా రెండు లక్షల 50 వేలు, తిరుమల టు తిరుపతికి 9 బస్సులు నడపగా ఐదున్నర లక్ష రూపా యలు ఆదాయం వచ్చిందని ఆయన వివరిం చారు. దీంతో పాటు ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకుని సత్యవేడు నుంచి నేరుగా తమిళనాడు తిరువన్నా మలైకు రెండు బస్సులు నడుపు తున్నామన్నారు. ఇందులో రాను, పోను పెద్దలకు 650 రూపాయలు, పిల్లలకు 350 రూపాయలు ఛార్జీలుగా వసూలు చేస్తున్నామన్నారు. మరో రెండు బస్సులు సత్యవేడు నుంచి తిరుపతి మీదుగా తిరువన్నామలైకు నడుపుతున్నామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

ప్రజాశక్తి -ఏర్పేడు : మండ లంలోని రావిళ్ల వారి కండ్రిగ సచివాలయం పరిధిలో ప్రాథమిక పాఠశాలలో బుధవా రం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష విజయ వంత మైంది. ఈ కార్యక్ర మానికి ఇద్దరు వైద్య అధికారులు, ఒకరు గైనకాలజిస్ట్, మరొకరు చర్మ వ్యాధి నిపుణులు గ్రామంలోని 440 మంది ప్రజలకు సేవలందించారు. పది మందిని ఇతర ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పి శిల్ప, ఓ సురేష్ బాబు , ఆర్ రెహమాన్ , జి సుమలత, కంటి విభాగం ఆప్తాలమిక స్పెషలిస్ట్ ఏ రెడ్డి బాలాజీ, గ్రామస్థాయి నాయకులు గోపి యాదవ్ , పంచా యతీ సెక్రటరీ యమున, ఈఓపిఆర్‌డి రమణ, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏపిఎస్ఎస్‌డిసి చైర్మన్‌కు నేదురుమల్లి అభినందనలు

ప్రజాశక్తి-వెంకటగిరి: రెండవసారి ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏపిఎస్‌డిసి చైర్మన్‌గా నియమితులయిన కొండూరు అజయ్‌రెడ్డిని బుధవారం విజయవాడలో తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా యువత మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేలా ఏపిఎస్‌డిసి ఆధ్వర్యంలో శిక్షణపై అవగాహన మరింత విస్తృతం చేసేలా అజయ్‌రెడ్డి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



టీడీపీకి అండగా నిలబడాలి: బొజ్జల రిషితారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ టీడీపీకి అండగా నిలబడాలని ఆ పార్టీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి విజ్ఞప్తి చేశారు. 'బాబుతో నేను'లో భాగంగా బుధవారం ఆమె శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డులో పర్యటించారు. స్థానికులు ఆమెకు హారతులు పడుతూ ఘన స్వాగతం పలికారు. బొజ్జల రిషితారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఎలాంటి అవినీతికి పాల్పడక పోయినా నైపుణ్యాభివృద్ధి సంస్థ కేసులో అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఆయనకు న్యాయ స్థానంలో బెయిల్ రాకుండా ముఖ్యమంత్రి జగన్ వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో ఏనాడూ అక్రమాలకు పాల్పడలేదన్నారు. అలాంటి వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం బాధాకరమన్నారు.



శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, వైసీపీ హయాంలో ఏ ఒక్క అభివృద్ధి చేపట్టలేదన్నారు. అయినా వారు అన్నీ తామే చేసినట్లు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీకాళహస్తిలో అభివృద్ధి కావాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మిన్నల రవి, రావిళ్ల మునిరాజా నాయుడు, తీర్థం వెంకటేశ్వర్లు, పోలూరు శ్రీనివాసులురెడ్డి, వజ్రం కిషోర్, మునిరాజా యాదవ్, యాదగిరి, దుర్గా ప్రసాద్, గోవిందు, రామచంద్రయ్య, అస్మత్, దారా పాండు, ఢిల్లీ బాబు పాల్గొన్నారు.

ప్రజల ప్రభుత్వాన్ని ఆదరించండి: ఎమ్మెల్యే



గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభు త్వాన్ని ప్రజలు వంరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపు నిచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం ఆయన పట్టణం లోని 4వ వార్డు ముత్తరాశిపాలెం, నక్క హరిజనవాడ, సున్నపు హరిజనవాడ, ఏనుగుల గుంటలో పర్యటించారు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. లబ్ధిదారుల వద్దకు వద్దకు వెళ్లి 'ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా?' అని అడుగుతూ ముందుకు సాగారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రావు పవార్, గుమ్మడి బాలకృష్ణయ్య, పగడాల రాజు, ముత్యాల పార్థసారథి, పంతులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి -కోట : కోట, వాకాడు, చిట్టమూరు మండల పరిధిలో ప్రభుత్వ, ప్రవేటు విద్యుత్ బకాయిలు కలిపి 20 కోట్ల రూపాయలు , ఆక్వా బకాయిలు 5 కోట్ల రూపాయలు ఉంటుందని జిల్లా స్థాయి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ ఆఫీసర్ బాలచంద్ర అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కోట మండలంలోని విద్యానగర్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పలు రకాల బకాయిల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్ డివిజనల్ పరిధిలోని విద్యుత్ కస్టమర్ లందరూ ఎలాంటి బకాయిలు లేకుండా సకాలంలో విద్యుత్తు బిల్లులను చెల్లించాలని తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ శాఖ అధికారులు, తదితర విద్యుత్తు సిబ్బంది సకాలంలో స్పందించి ప్రతి ఒక్కరూ విద్యుత్ బకాయిలు చెల్లించేలా చైతన్యవంతం చేయాలని ఆయా విద్యుత్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ సబ్ డివిజనల్ ఏడిఈ వరప్రసాద్ రెడ్డి, కోట ఏఈ మునీంద్ర రెడ్డి, తదితర విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టేబుల్ 9 మూడో బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుల్ నైన్ మూడవ బ్రాంచ్ ను తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి ప్రారంభించారు. స్థానిక కరకంబాడి రోడ్ లోని డీమార్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన నూతన బ్రాంచ్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ 9 హోటల్ తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే వినియోగదారుల మన్ననలు పొందిందన్నారు. నగరంలో ఇప్పటికే రెండు బ్రాంచ్ లు విజయవంతంగా నడుస్తున్నాయని, ఈ మూడో బ్రాంచ్ కూడా సక్సెస్ మార్గాల్లో ప్రయాణించాలని అభినందించారు. ఆ సంస్థ అధినేత వైష్ణవ్ మాట్లాడుతూ టేబుల్ 9 బ్రాంచ్ లను ఇప్పటికి తిరుపతిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద, కపిల్ తీర్థం రోడ్ లోనూ ఏర్పాటు చేశామన్నారు. మూడవ బ్రాంచ్లో గెస్ట్‌లైన్ హోటల్ సమీపంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. టేబుల్ నైన్ ఆహారాన్ని తిరుపతి మొత్తం విస్తరింప జేయా లని లక్ష్యం తో ముందు కు వెళు తున్నా మ న్నా రు. జాయిం ట్ బిర్యానీ లెమన్ చికెన్ తమ ప్రత్యేకతని, ఇతర వాటితో పోలిస్తే తమ రెస్టారెంట్ల లోని ఆహా రం కాస్త స్పైసీగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్, డాలర్ దివాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, తిరుపతి హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు చిల్లీస్ అంజి, కార్పొరేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



ప్రాణాలు తీస్తున్న ఆర్టీసీ విలీనం: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేస్తూ సీఎం జగన్ తీసుకున్న అసమర్థ నిర్ణయం కారణంగా ఆర్టీసీ ఉద్యోగుల ప్రాణాలు బలైపోతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథా చారి ఆరోపించారు. స్థానిక పద్మశాలి పేటలో నివాసముండే శ్రీకాళహస్తి ఎపీయస్‌ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ హఠాన్మరణం చెందిన బత్తల రాంబాబు భౌతిక దేహానికి టీడీపీ నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. విలీనమే మహా ప్రసాదం అన్నట్లుగా ఎపీయస్‌ఆర్టీసీ ఉద్యోగులను భ్రమింపచేసి వారిని నిష్ప్రయోజనమైన ప్రభుత్వం లో కలిపేసి వారి జీవితాలను నాశనం చేసిన మహా దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి అని ఆరోపిం చారు. రిక్రూట్మెంట్లు నిలిపేసి పది శాతం సిబ్బందితో వంద శాతం బస్సులు నడుపుతూ డ్రైవర్లపై పనిభారం పెంచి వారి మరణానికి కారణం అవుతున్న సీఎం వైఖరి నశించాలని కోరారు.



వెంకటేష్ కుటుంబానికి బీమా సాయం పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని నేసనూరు సచివాలయ పరిధిలోని నేసనూరులో డి వెంకటేష్ అనారోగ్య కారణాల వల్ల స్వగృహంలో మృతి చెందాడు. వైఎస్ఆర్ బీమా ద్వారా నామిని డి వెంకటేష్ భార్య డి చంద్రికకి మట్టి ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయలు నేసనూరు సర్పంచ్ ఎం గోవిందస్వామి రెడ్డి చేతులు మీదుగా అందించారు. వెంకటేష్ మృతదేహానికి సర్పంచి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సంక్షేమ, విద్యా సహాయకులు, సచివాలయ కన్వీనర్, వాలంటీరు పాల్గొన్నారు.